# హద్దుమీరు వారు

— వడ్లమాని శ్యామసుందరరావు

"**అయ్యగారూ!**" వణకే కంఠంతో కన్నీరు ఉబకబోతున్న కళ్ళను దించుకుని, తల వంచుకొని, భయంగా పిలిచాడు రాములు.

వాలుకుర్చీలో భారీ శరీరాన్ని వాల్చి, కుర్చీ చాలక కాళ్ళని బల్లమీదకు చాచి పేపరు చదువుతున్న కనకరాజుగారికి రాములు పిలుపు వినిపించలేదు.

"అయ్యా!..." రుద్ధ కంఠంతో మళ్ళీ ఏడుస్తున్నట్లే పిలిచాడు రాములు- పదిహేడేళ్ళ ప్రాయంవాడు-నూనూగు మీసాలవాడు. తల్లీ, తండ్రీ చనిపోగా నౌకరుగా బ్రతుకుతున్నవాడు...జీవితానికి నిజాయితీని మాత్రమే ఇంతవరకూ వెనకేసుకో గలిగినవాడు.

"ఏమిటీ?" నిర్లక్ష్యంగా చూశారు యజమాని.

"మరే...మరే...నేను తప్పు చేశానండి..." భోరుమన్నాడు ఒక్కసారి.

ఆయన భొళ్ళున నవ్వేరు బొజ్జ ఊగేలా. "నీకు తప్పు చేయటం కూడా చేతనయిందంటే- నేన్నమ్మలేన్రోయ్."

"లేదండి...నేను నిజంగా...సత్యప్రమాణంగా తప్పు చేశానండీ." వెక్కివడుతున్నాడు వాడు. వాడి కళ్ళు ముందు చనిపోయిన తండ్రి మెదలుతున్నాడు. అతని అంతిమ సందేశం లాంటి మాటలు వినబడుతున్నాయి.

"ఒరేయ్...రాంవిగా! లోకంలో నిజాయితీకున్న శక్తి మరి దేనికీ లేదు. సత్యం చెప్పబట్టే గాంధీ మహాత్ముడయ్యాడు. హరిశ్చంద్రుడు అప్పటి కప్పుడు కష్టాలు పడ్డట్లు కనిపించినా చివరికి సుఖపడగలిగింది మాటకోసం పాకులాడబట్టే. నిజాయితీన్నమ్ముకో. అదే నీకు బతుకు తీవని చూపిస్తుంది" అంటూ మరో మాట కూడా చెప్పాడు- సిద్ధాంతానికి ఉప సిద్ధాంతంలా.

"ఒకవేళ తప్పనిసరై తప్పే చేశావనుకో...సాధ్యమైనంత వెంటనే చెప్పేసి ఒప్పేసుకో. ఒప్పేసుకొన్న తప్పు చెయ్యని తప్పుతో సమానమే. అబద్ధమాడావని ఒప్పేసుకుని నువ్వే నీ నోట చెప్పేస్తే తప్పంటదు."

"ఊం...ఏంవిటీ? నువ్వా తప్పు చేయగలిగానంటావు? అదే నిజమయితే నువ్వు గొప్పవాడివవడానికవి ఆ రోజు అట్టే దూరంలో లేదు. తప్పులు చేయటం వస్తే తప్ప గొప్పవాళ్ళు కాలేర్రా ఈ రోజుల్లో."

రాములు కాయన మాటలు కొంచెమయినా ఉపశమనం కలిగించలేక పోయిన ట్లున్నాయి. గుండెలో ఏదో గుచ్చుతున్నట్లే బాధపడిపోతున్నాడు.

"తప్పేనండి...నిన్న సాయంత్రం వేళ...అమ్మగారు బజారు కెళ్ళమంటే నడుస్తున్నానండి...వెళ్తుంటే సెంటరుకాడ పెద్ద బొమ్మండి...బొమ్మేటి...మనిషే...నిజమ్మనిషికంటె నూర్రెట్లు కళగా ఉందండి. ఉండి ఊరుకుంటున్నదా? లేదండి. మహాందంగా ఉందండి. మనసులోకి చూసేస్తూ మతి పోగొట్టేస్తున్నాదండి. ఆ కళ్ళు కళ్ళుగావండి...ఆ ఒళ్ళు ఒళ్ళుకాదండి. ఒక్కసారి చూసేసరికే మతి మతిలో లేకుండా మత్తెక్కిపోయానండి సత్యంగా.

"నిజంవండి. నేను పిచ్చెక్కిపోయానండి ఆ బంగారు బొమ్మని చూసేసరికి. అంతలోనండి...అగ్ని కాజ్జంలా బొమ్మకి తోడు బండండి. సినేమాబండండి. ఆ బండి మీదా ఆవిడ బొమ్మేనండి మళ్ళీ. ఎలా చూస్తుందని కళ్ళతోనే తినీసేల...చూపుతోనే తాగీసేలా. దానికి తోడు ఊపుల పాటండి. ఉషారు పాటండి. మర్నా మనసు మనసులో మిగల్లేదండి. మతి పూర్తిగా పోయిందండీ. మొదటాట సినేమా చూడకపోతే మరి మనిషిని మిగలగల్ననిపించలేదండీ... సినేమా చూసేకపోతే ప్రాణం పోతుందేమో అనే అనిపించేసిందండీ-ఆ బొమ్మ చూపుకీ, ఆ బండి పాటకీ. కానీ, చేతిలో కాన్దబ్బుల్లేవండి. ఏం చెయ్యాలా అని దిగులువడుతూ వచ్చేనండీ...మీరుంటే అడుక్కుందామని. మీ గదిలో కొచ్చేనండి...మీ ర్లేరండి. మీ టేబులున్నాదండి...దాని మీద...పది రూపాయల్నోటున్నాదండి..." వాడి దుఃఖం ఎక్కువైపోయింది.

మాటలు అస్పష్టతకి లోనవసాగాయి.

"మనసు కోతండి...మంచీ చెడూ చూడదండి...ముందూ వెనకా కానదండి...అందుకే... సినీమా సందడిలో...జీవితంలో మొట్టమొదటిసారీ...చివరిసారీ ఇదే కావాలండీ...పది రూపాయల్నోటండి...పాడు బుద్ధి...తీసుకున్నాదండీ... సినేమా చూసేనండి...కొంచెం సరదా చేస్కున్నానండీ...ఇవిగోండి అయిదు రూపాయలు...మిగిలేయండి...చెంపలేసుకుంటున్నానండి...క్షమించండి...అయిదు రూపాయలూ జీతంలో విరగ్గోసెయండి."

భోరున ఏడ్చేశాడు రాములు.

కనకరాజుగారు జాలిగా చూశారు.

జాలిగా నవ్వేశారు. "పర్లేదులే. అయిదు రూపాయలేగా. ఇన్నాళ్ళనుంచీ నమ్మకంగా వస్తేస్తూ వస్తున్నావు- చాలు...ఏడవకు. ఊరుకో నువ్వు."

వాడు ఏడుపు ఆవలేదు.

ఆయనకి కొంచెం చిరాకేసింది. "పర్లేదన్నానుగా..." కసిరారు. "ఫో."

వాడు అడుగు వెయ్యబోయాడు.కాని,కాలు సాగలేదు.

"అది కాదండి...అయ్‌గారూ...నేను..." వెక్కివెక్కి ఏడ్చేస్తున్నాడు.

చదువుతున్న పేపరు పక్కన పడేసి,సునిశితమయిన దృష్టితో వాడి ముఖంలోకి చూశారాయన.

వాడు ఏడుస్తున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

కళ్ళు ఎర్రబడేలా ఏడుస్తున్నాడు.

కన్నీరు చెంపలమీద కాల్వలు కట్టేలా ఏడుస్తున్నాడు.

## భక్తి

కృత యుగాన హిరణ్య కశిపుడు
విష్ణువుపట్ల మత్సరం ప్రకటించాడు
బాల ప్రహ్లాదుడు భక్తుడై తరించాడు
తండ్రిమాత్రం ద్వేషాన్నే వరించాడు-

త్రేతాయుగంలో మారుతి
సేవకుడై రాముని కొలిచాడు ప్రీతి
భక్తి భావానికి శబరీ గుహుడూ
ప్రతీకలుగా నిలిచారు నాడూ నేడూ-

కామ వివశలై వ్రేపల్లె గోపికలు
భక్తి పరవశులై సంయమి మూకలు
దేవుణ్ణి ధ్యానించారు అనవరతం
కామభక్తి సుమా వాళ్ళది అహరహం-

తిన్నడూ, ఫణీ, హస్తి
మూఢ భక్తితో పొందారు ముక్తి
కంసుడూశిశుపాలుడూ వగైరా
కొలిచారు హరిని వైరభక్తి ద్వారా-
పశువులన్నీ వేరైనా పాలు ఒక్కటే
దారులెన్ని వేరైనా ద్వారమొక్కటే
వైరంతో ఒకరు ప్రణయంతో ఒకరు
భక్తు లెన్ని రకాలైనా భావ మొక్కటే-

ఆ నాడు భక్తి ముక్తి దుర్గ శోధనం
ఈనాడు భక్తి రక్తి మార్గ సాధనం
నాడు భక్తి ప్రశాంత చిత్తకలితం
నేడు భక్తి స్వార్ధ సంకలిత దురితం-

-మధురవాణి

ఆయనకి చిత్రంగా అనిపించింది.

ఇంకా విచిత్రంగా అనిపించింది.

"ఊరుకో..." మళ్ళీ చెప్పేరు...ఈసారి ఎక్కువ చిరాకుగా...కఠినంగా.

ఊరుకోలేకపోయేడు వాడు-ప్రయత్నించినా.

వెక్కివెక్కి ఏడవకుండా ఉండలేకపోతున్నాడు వాడెంత కష్టపడి యత్నిస్తున్నా.

వాడి ముఖంలోకే సూటిగా చూడసాగారు.

వాడు ఆ చూపు భరించలేనట్లు తల వంచేను కున్నాడు.

వాడి ముఖం మీద ఆయన కళ్ళు.

వాడి కళ్ళలో నీళ్ళు...గొంతులో దుఃఖం...

గుండెలో పశ్చాత్తాపం...

క్షణాలు...నిముషాలు...

ఒక్కసా రాయన తుళ్ళిపడ్డారు.

అయన మెదడులోని ఆలోచనలో మెరుపు మెరిసినట్లే అయింది.

"ఒరేయ్...రా(విగా!" గద్దిస్తున్నట్లే గట్టిగా అరిచారు.


"అయిదు రూపాయల తప్పు క్షమించాను. ఆ వాచీ ఇచ్చెయ్ మర్యాదగా."

తెల్లబోయేడు రాములు.

వెర్రిమొహం వేశాడు.

"వాచీ ఏంటండీ!"

"దొంగ వేషాలు వెయ్యకు. బుద్ధిగా ఇచ్చెయ్...నిన్న నువ్వు దొంగిలించిన...అయిదు వందలు ఖరీదు చేసే వాచీ..."



నిలువెల్లా వణికిపోయేడు వాడు.

"బాబోయ్...అయ్యగారూ...నేనేం ఎరగనండి. సత్యప్రమాణంగా ఏ వాచీ నేను తియ్యలేదండీ. నా కంటితో చూడనైనా లేదు. నిజమండి...నన్ను నమ్మండి."

"నోర్ముయ్! నీ దొంగ వేషాలు నాకు తెలియవనుకోకు. పది రూపాయలే దొంగిలిస్తే అంత బాధా పడవు, పశ్చాత్తాపమూ పడవు. ఫరవాలేదని నేననగానే పోయేవాడివి. నువ్వింత ఇదిగా గుండెలో దాచుకోలేక పోతున్నావంటే కచ్చితంగా నువ్వు చేసింది చిన్న దొంగతనం కాదు. పెద్ద దొంగతనమే. పది నోటే కాదు, వాచీకూడానే. చెప్పు. ఏం చేశావు నా వాచీని? ఎక్కడ దాచావు?"

కుర్చీలోంచి లేచి వాడి చెయ్యి పట్టుకోబోయారు.

"దొరగారూ! మాఅయ్య మీ దొట్టు. దేముడి మీ దొట్టు. మీ వాచీ నేను కంటితో చూడనైనా చూళ్ళేదు, బాబో..." ఆయన కాళ్ళమీద పడిపోయాడు కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ.

"నోర్ముయ్! దొంగవెధవా!" ఒక్క తాపు తన్నారు కాలికొద్దీ. అంత దూరం ఎగిరిపడ్డాడు రాములు.

"నేను...నే నొక్కసారే దొంగవని... పాడు పని... చేశాను. పది రూపాయల్నోటే తీశాను. అంతకంటె నాకేం తెలవదు. ఇంకే పాపమూ పాడూ నాకు తెలవదు. నన్నిశ్వసించండి. ఆ వాచీ నే న్నొడనైనా చూళ్ళేదంతయ్యా."

కోపంగానూ, వెటకారంగానూ కూడా అరిచారాయన.

"ఒరే...నేను పిచ్చివాణ్ణి కానురా నీ మాటల్నమ్మేందుకు. వాచీ కింద పెట్టిన పది రూపాయల్నోక దొంగా, వాచీ మరో దొంగా ఎత్తుకు పోయారంటే నమ్మేంత వెర్రి వాణ్ణి కానురా. చెప్పు, వాచీ ఏం చేశావు?"

రాముల్ని చెంపలు ఛెళ్ళుమంటున్నాయి.

వీపుమీద దెబ్బలు మోతెక్కిపోతున్నాయి.

శరీరం హూనమైపోతోంది.

రక్తం ధారలు కడుతోంది.

గుండె మండిపోతోంది. నోరు తడారిపోతోంది. వాడి కళ్ళలో...గొంతులో... గుండెలో... మనసులో ఆర్ద్రత ఆరిపోతూంది ఆ చిత్రహింసకి.

యజమాని కొడుతున్న ప్రతి దెబ్బా నిజాయితీ కంకితమయిన వాడి గుండె మీదే తగులుతూంది.

నిజాయితీ మీదే తగులుతున్నా యా దెబ్బలు సమ్మెట పోట్లలా. వాడు సొమ్మసిల్లి పడిపోయాడు.

అవును. ఆ అమాయకుడికి తెలియదు ఈ లోకం తీరు.

"ఈతకాయిచ్చి తాటికాయ లాక్కుందామనా! పది రూపాయల నోటు దొంగతనం చేశానని ఒప్పేసుకుంటే నీ నిజాయితీకి హర్షించి బుట్టలో పడిపోయి, వాచీ నువ్వు తీయలేదని నమ్మేస్తాననా? నా దగ్గర నీ పప్పు లుడకవు. వాచీ సంగతి చెప్పు. అది నువ్వే తీశావు. నువ్వే... నువ్వే..." గద్దిస్తున్నారు యజమాని ఇంకా వాణ్ణి చితకబాదుతూ.

తప్పుని మించిన పశ్చాత్తాపం ఎదుటివాడిలో క్షమాగుణాన్ని హరించి, అనుమానానికి దారి తీస్తుం దన్న పరమసత్యం తెలియని అమాయకపు రాములు ఇంకా అలాగే దెబ్బలు తింటూనే ఉన్నాడు!